# కూరాకులు



"ఆకుకూరలోయమ్మా.... ఆకుకూరలూ.... పాలకూర, చుక్కకూర, తోటకూర...." పొద్దున్నే... ఫ్యాక్టరీ సైరన్‌లా లలిత గొంతు. ఆకుకూరల గంపను అరుగుమీద దించుకుంది. ఇంట్లోకి తొంగిచూస్తూ "ఆకుకూరలమ్మా... ఆకుకూర లొచ్చినై" మర్యాదగా గుర్తు చేసింది. నునులేత సూర్యకిరణాలద్దుకుని మెరుస్తున్న చెమట బిందువుల్ని కొనకొంగుతో అద్దుకుంది. వెంటనే కొంగును నడుముకు బిగించుకుంది.

"వచ్చినవా లలితా! ఏమేం కూరలు తెచ్చినవూ?" టూత్‌బ్రష్‌ను పళ్ళ మీదాడిస్తూ వయ్యారంగా బయటికొచ్చింది సుశీల. నుదుటి బొట్టుమీద సయ్యాటలాడుతున్న ముంగురుల్ని మునివేళ్ళతో సవరించుకుంది. తనలోతాను నవ్వుకుంది లలిత "ఇయ్యాల్ల పాలకూర, చుక్కకూర, తోటకూరలు... నవనవలాడ్తున్నయమ్మా. అవ్వే తెచ్చిన" గంపలోంచి కూరకట్టలు తీసి చూపించింది. ఓ నిట్టూర్పు విడిచి అలసటను తరిమికొట్టింది.

మరోసారి ముంగురులు సవరించుకుంటూ కూరకట్టలు తీసుకుని లలిత మొహాన్ని పరిశీలనగా చూసింది సుశీల. ఆరబోసిన అమాయకత్వం... ముక్కుకు ముత్యాల ముక్కుపోగు... అమ్మవారిలాగుంది. కాని... ఎర్రని పెదాల కనుకొలుకులు... "గట్లజూస్తున్న వెందుకమ్మా?" లలిత తనను చూసుకుని ఎదమీది కొంగును తడుముకుంది.

"ఆ... ఏం లేదు లలితా! నీ పెదవుల కొలుకులు తెల్లబడ్డయేందీ?" డబ్బులు చేతికిస్తూ అడిగింది. లలిత మొహంలో అయోమయం. "ఏమోనమ్మా మా ఆయనగ్గూడా గట్లే అయింది". పెదవుల కొలుకుల్ని ఎడమచేతి వేళ్ళతో నిమురుకుంది. "వయసు నలభైకొస్తుంది గదమ్మా..." ఇంకేదో అనబోయింది. "వయసుతో వచ్చేది కాదది. ఇంకేదో కారణముంటుంది. సగమీదుగ్గూడా రాలేదు. అప్పుడే అట్లవుద్దా?" కొట్టిపారేసింది సుశీల.

ప్రజా సంక్షేమ దేశములో ప్రభుత్వమిచ్చిన రెండెకరాల భూమిని నమ్ముకుని బొటాబొటి జీవనచక్రాన్ని తిప్పుతున్న లంబాడి దంపతులు లలిత- నాగరాజులు. రెక్కలాడిస్తూ డొక్కలాడించుకునే శ్రమజీవులు.

"అదేందో మాకు తెల్వదమ్మా" విచారంగా అంది లలిత.

"అద్సరే... ముందే మనది నీటికరువు ఏరియా గదా! ఎండకాలం గూడా ఫ్రెష్షు కూరలందిస్తున్నావు. నీటి వసతి అంత బాగుందా?" సుశీల భృకుటి ముడిపడింది. "బ్యాంకుల లోను దీసుకుని బోరుబాయి తవ్వించి దానికి కరంటు మోటార్ వెట్టినమమ్మా. దాని పుణ్యమాని నీటికరువు లేదు. మరి... మీకు నీళ్ళ కరువుందామ్మా?"

"మీరదృష్టవంతులు. మా ఇంట్ల ముందటి బోరుబాయి ఎండిపోయింది. మా డాక్టర్‌సాబు ఇంకో బోరు వేయించిండు. దాంతోని ఇంటి మందం నీళ్ళొస్తున్నాయి". "మీ భర్త గవర్నమెంటు డాక్టర్ గదమ్మా". "అవును సర్కారు నౌకరి. పొద్దున లేవంగానే తయారై దవాఖానకు పోతడు. సాయంత్రం ఇంటిదగ్గర ప్రైవేటు ప్రాక్టీసు. క్షణంగూడా తీరిక ఉండదు. రోజూ ఆకుకూరలు తినాలంటడు". చెవుల జూకాలు ఉయ్యాలలూగినై.

"సరేగాని సుశీలమ్మా, నాకో సాయం చెయాయలమ్మా"

"ఏం సాయం లలితమ్మా. రోజూ కూరకట్టలిస్తున్నావుగాని ఎప్పుడు సాయమడగలేదు" ఆసక్తి కనబరిచింది.

"నిజమే. నాకు, నా భర్తకు గీపెదవుల కొలకులు తెల్లబడినై. ముందటంత హుషారు లేదు. ఏదో బలహీనంగా వుంటుందమ్మా. ఓసారి డాక్టర్ సాబుకు చూపించుకోవాలె." "చూపించుకోండ్రి. నేను మా డాక్టర్ సాబుకు చెప్తాగాని... రేపు ఆదివారం గదా!" "అవునమ్మా!".

"ఆదివారం సాయంత్రం ఆయన ఇంట్లనే ఉంటడు. మీరొచ్చి చూపించుకోండ్రి. వైద్యం చేయించుకోండ్రి". లలిత మొహం ఆశాభావంతో వెలిగిపోయింది. "పాపం, కష్టజీవులు. చెమటోడ్చి కాయకష్టం చేసుకునేటోళ్ళగ్గూడా రోగాలెందుకొస్తయో!... గొణుక్కుంది సుశీల.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది లంబాడి తండా. అక్కడున్న గిరిజనులందరికీ ప్రభుత్వం ఉపాధి కల్పించింది. మరకొందరితో పాటు నాగరాజు దంపతులకు రెండెకరాల భూమి యిచ్చింది. చాలామంది ప్రభుత్వమిచ్చిన భూమిలో ఆకుకూరలు, కాయకూరలు పండించి జీవితాలీడుస్తున్నరు. బ్యాంకు అప్పు తీసుకుని బోరుబావులు వేయించుకుని నీటివసతి సమకూర్చుకున్నారు.

రోజూ... తెల్లవారకముందే నిద్రలేచి తయారై పొలానికెళ్ళడం నాగరాజు కలవాటైంది. పొలంలోంచి ఆకుకూరలు బస్తాలో వేసుకుని తెచ్చేలోగా లలిత పిల్లలకోసం వంట తయారుచేస్తుంది.

ఆకుకూరల్ని తుంచి కట్టలుగా కట్టడం ఇద్దరికీ నల్లేరు మీద బండి నడకైంది. అప్పుడప్పుడు హైద్రాబాదు నుండి వ్యాపారస్తులు వచ్చి ఆకుకూరల్ని హెూల్‌సేల్‌గా కొనుక్కెల్తారు. మిగతా రోజుల్లో లలిత కూరకట్టల్ని గంపలో సర్దుకుని ఊళ్ళోకొస్తుంది. గల్లీలు తిరుగుతూ అమ్ముకుని తిరిగివెళ్తుంది. బయలుదేరేముందు గరంచాయ్ కడుపుల పడగానే హుషారొస్తుంది. ఆకుకూరల కట్టలమ్ముతూ ఊరంతా తిరిగేసరికి వాడిపోయిన కూరాకులాగైపోతుంది ప్రాణం. ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకుంటుంది.

ఆలోగా నాగరాజు ఇంటిదగ్గర పిల్లల్ని తయారుచేసి బడికి పంపిస్తాడు. వంటచేసుకుని ఇద్దరూ కలిసి భోంచేస్తారు. ఆ తర్వాత పొలానికెళ్తారు.

కూరమొక్కల్ని చూడగానే ప్రాణం లేచొస్తుంది. బోర్ మోటారువేసి కూరమడులకు నీళ్లు పారిస్తారు. ఆడుతు పాడుతూ పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నదీ? అనుకుంటూ చెమట వాసనలు పంచుకుంటారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని మనసారా అనుభవిస్తుంటారు. కాని... పెదవుల కొలకుల్లో తెల్లదన మెందుకొస్తుందో అర్థంగాక అల్లాడిపోతున్నారు.

వాళ్ళ మాదిరిగానే తండాలో మరికొందరు శ్రమజీవుల పెదాల కొలకులు తెల్లబారినై. రోజూ గొడ్డుకారంతోని కడుపునిండా సంగటి భోజనం చేస్తున్నా అలా ఎందుకవుతుందో ఎవరికీ అర్థంకావడం లేదు. వయోభేదం లేకుండా యువకులగ్గూడా అట్లనే అవుతుంది.

పాపం! రెక్కల కష్టాల్ని నమ్ముకున్న శ్రమజీవులు, భూమాతను నమ్ముకొని బతుకుబండి నడుస్తున్న లలిత సమస్య ఆరోగ్యపరమైందే. దాన్ని తన భర్త డాక్టర్ రాంచందర్ పరిష్కరించగలడు... సుశీల మెదడు పొరల్లో లలిత మాటలు కబడ్డీ ఆడుకుంటున్నాయి.

రాత్రి భోంచేసేటప్పుడు భర్తకంతా చెప్పేసింది. "లలిత ఆమె భర్త నాగరాజును రేపు ఆదివారం సాయంత్రం రమ్మన్నాను. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాళ్ళకు వైద్యం చెయ్యండి" ప్రాధేయపడింది. రాంచందర్‌కు తృప్తిగా వుంది. భార్య కొత్తగా కనబడింది.

"ఆహా! నీ అందం వందరెట్లు పెరిగిపోతుందోయ్!" చూపులు సుశీల నాపాదమస్తకం పరిశీలిస్తున్నాయి. ఇద్దరూ చేతులు కడుక్కుని సోఫాలో కూర్చున్నారు.

"నేను చెప్పిందంతా విన్నట్లా లేక గాలికొదిలేసినట్టా?" భర్తకు వక్కపొడి అందిస్తూ మూతి మూడువంకర్లు తిప్పింది.

"అర్ధాంగి చెప్పిన విషయాన్ని అశ్రద్ధ చేస్తానా? రేపు వాళ్ళు రానీ. ఇంట్లోనే ఉంటానుగదా!"

"అట్లా అన్నారు బాగుంది!" మొహం బంతిపూవులా విచ్చుకుంది.

"ఆహా! రోజురోజుకు మెరుగులు దిద్దుకుంటున్న నీ అందాల మీద పరిశోధన చేసి పెద్ద గ్రంథమే రాయొచ్చు." చెంపలందుకోబోయాడు.

"ఆ... బాగానే ఉంది సంబడం! పిల్లలింకా నిద్రబోలేదు స్వామీ!" బుగ్గలు సిగ్గులు సింగారించుకున్నాయి.

ఆదివారం సాయంత్రం డా॥ రాంచందర్ క్లినిక్ మూసి ఉంటుంది. ఇల్లు, క్లినిక్ కలిసే వున్నాయి. ఆదివారం సాయంత్రం భార్యా పిల్లలంతా సినిమాకో, షికారుకో వెళ్ళడమలవాటు. భార్య కోరికను మన్నించి ఆ రోజు మాత్రం లలితకు కేటాయించాడు.

ఐదింటికే లలిత భర్తతో వచ్చేసింది. సుశీల వాళ్ళిద్దరినీ సాదరంగా ఆహ్వానించింది కూర్చోబెట్టింది. భర్తను పలిచింది.

"నమస్తే సార్!" లలిత – నాగరాజుల కోరస్. నమస్కార బాణం డా॥ రాంచందర్ గుండెలకు తాకింది. మొహం వికసించింది. వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. వాళ్ళిద్దర్నీ ఎగాదిగా చూసి తృప్తిగా నిట్టూర్చాడు.

లంబాడితండాలో వుంటున్నా లక్షణంగా వున్నారు. మారుతున్న కాలాని కనుగుణంగా సాంప్రదాయ దుస్తుల్లో అసలు సిసలైన భారతీయుల్లాగున్నారు... అనుకుంటూ సుశీల అందరికీ చాయ్‌లందించి భర్త పక్కన కూర్చుంది. చాయోత్సాహం అందరిలో ఉత్సాహాన్ని నింపేస్తోంది.

డా॥ రాంచందర్ సర్దుక్కూర్చున్నాడు. "చెప్పండి మీ సమస్యేమిటీ?" ఇద్దరినీ అడిగాడు.

"సారూ!" లలిత బెరుకు బెరుగ్గా ముడుచుకుపోతోంది.

"ఇది మీ యిల్లే అనుకోవాలె. మీ సమస్యలన్నీ చెప్పేయ్యాలె" సుశీల ఒంటిరాయి ముక్కుపుడక తళుక్కుమంది.

"మేము ఆకుకూరలు పండించి అమ్ముకుంటం సారూ!" నాగరాజులో ఆత్మవిశ్వాసం ఆవులించింది. "రోజూ గొడ్డుకారంతోని కడుపునిండా తింటున్నం, కంటినిండా నిద్రపోతున్నాం. కాని గీ పెదవుల కొలుకులు తెల్లబడుతున్నయెందుకో తెల్వదు. కొద్దిసేపు పంజేసినా చాలాసేపు చేసినట్టు అలసట వస్తుంది. ముందు ఎంతసేపు పంజేసినా ఏమీ అన్పించేది కాదు. ఇప్పుడేమో ఓ గంటసేపు పొలంల పంజెయ్యంగానే డీలాపడిపోతున్నం. బలవంతంగా ధైర్యంతోని పంజేస్తున్నం".

"అదా మీ సమస్య." వాళ్ళిద్దరి పెదవుల కొలకుల్ని పరీక్షించి చూశాడు. డా॥ రాంచందర్. స్టెతస్కోపు తెచ్చి ఇద్దరినీ పరీక్షించాడు. అనారోగ్య సమస్య అవగాహనకొచ్చింది. తిరిగి అందరూ సోఫాలో కూర్చున్నారు.

"లలితమ్మా! మీరు ఎన్ని సంవత్సరాల నుండి ఆకుకూరలు పండిస్తున్నారూ?" డా॥ రాంచందర్ పెదాలమీదో చిరునవ్వు తొంగిచూసింది. అలా ఎందుకడుగుతున్నాడో అర్థంగాక లలిత - నాగరాజులు అయోమయంగా ముఖాలు చూసుకొని సైగలు చేసుకున్నారు. నాగరాజు ముందుకు వంగి "అయ్యా! ఏడెనిమిదేళ్ళ నుండి పండిస్తున్నమయ్యా!" అన్నాడు.

"మీరు పండించిన ఆకుకూరల్ని మీరు తింటున్నారా?"

"అమ్మో!" లలిత గుండెలమీద చెయ్యేసుకుంది.

"ఆడీ! నువు జెర ఆగు". భార్యను ఆపేసి డాక్టర్ వైపు తిరిగాడు నాగరాజు. "గా ఆకుకూరల్ని మేమెట్లా తింటం సారూ? దాంట్ల ఏముందనీ? మాంఛిగ మిరపకాయల్తోని కారం నూరుకుని అన్నంల కలుపుకు తింటం. పచ్చి ఉల్లిగడ్డ అంచుకు పెట్టుకుంటం. చాలా బాగుంటది సారూ! ఆకుకూరల్ని మీ అసొంటి నాజూకు మనుషులు, ఫ్యాన్ కింద పంజేసెటోళ్ళు తింటరుగదా! వాటిని మేము తింటమా?"

సమస్యలోని ఆంతర్యం మరికొంత తెలిసినట్టు డా॥ రాంచందర్ తలూపాడు. "గొడ్డుకారం రోజూ తింటూంటే ఆరోగ్యానికి మంచిది కాదు. అయినా... మీరు ఆకుకూరల్ని తినొద్దని ఏదైనా ఆచారముందా? అవి ఆరోగ్యానికి చాలా మంచివి".

"ఆచారమేమీ లేదుగానీ మేము తింటలేము సారూ!" లలిత కళ్ళు ఆశ్చర్యంతో విశాలమైనాయి.

"మీ పెదవుల కొలుకులు తెల్లపడడానిక్కారణం... మీరు బలహీనమై పోతున్న కారణం... మీ శరీరాల్లో బి$_6$, బి$_{12}$ అనే విటమిన్స్ అంటే... బలాన్నిచ్చే పదార్థాలు లోపించినై. దీన్ని మెడికల్ పరిభాషలో ఆంగ్యులర్ స్టొనలైటిస్ అంటారు. ఆకుకూరలు తినకుంటే నరాల బలహీనత ఏర్పడుతుంది. పెదవుల కొలుకులు తెల్లబడుతై. బలహీనత ఆవరిస్తుంది." "అట్లనా? మరైతే దానికి మందులు మీ దగ్గర దొరుకుతయా లేక హైద్రాబాదు నుంచి తెప్పిస్తరా?" నాగరాజు పెదవుల కొలుకులు పుణుక్కున్నాడు." మీరు మందులు రాసిస్తే తెప్పించుకుని వాడుకుంటం సార్!" చేతులెత్తి దండంబెట్టాడు.

వాళ్ళ అమాయకత్వాన్ని అంచనా వేసి తనలో తాను నవ్వుకున్నాడు డాక్టర్. లోలోపలి నవ్వు పెదాలమీద చిరునవ్వుగా మెరిసింది. "ఆ మందులు మీ దగ్గరనే ఉన్నాయి గదా!"

"మా దగ్గరనా?" నాగరాజు నోరెల్లబెట్టాడు. "అమ్మతోడు. మా దగ్గర మందులు, మాకులెవ్వీ లేవు సారూ!" లలిత కుడి అరచేతిని నెత్తిమీదుంచుకుంది. "అయ్యో! నాటుమందులు - మాకుల గురించి కాదమ్మా నేనన్నది." డా॥ రాంచందర్ సముదాయింపుకు దిగాడు. "ఆకుకూరలల్ల ఇంతకు ముందు నేను చెప్పిన బి$_6$, బి$_{12}$ మరింకెన్నో విటమిన్స్ వున్నాయి. వాటివల్ల బలం వస్తుంది. నరాలు మంచిగ పంజేస్తయి. మీరు పండించిన ఆకుకూరల్ని మీరు గూడా తినండి. తెల్లదనం కొలుకుల నుండి మాయమైపోతుంది. మీ బలహీనత గూడా వుండదు. ఆకుకూరలంటే మనలాంటి వాళ్ళకు అమృతంలాంటివి."

"అట్లనా సారూ! చంకలపిల్లను వెట్టుకుని ఆ పిల్లకోసం ఊరంత దేవులాడి నట్లయిపోయిందన్న మాటా!" లలిత నిర్భయంగా నిట్టూర్చింది. "రేపట్నుంచి ఆకుకూరల్ని తింటం. కానీ... కొందరు వ్యాపారస్తులు హైద్రాబాదు నుంచి వచ్చి మా ఆకుకూరల్ని లారీల తీస్కపోతున్నారు. వాటితోని ఏంజేస్తరు సారూ?"

"వాటితోని బి$_6$, బి$_{12}$ విటమిన్స్ గోలీలు తయారుచేస్తారు. మీ ఆకుకూరల్తోని తయారైన గోలీలను మీకు అమ్మి సొమ్ము చేసుకుంటారు."

"హమ్మో! గట్లనా!" నాగరాజు ఆశ్చర్యం. "నిజమే, మా ఆకుకూరల్ని మేము తింటాం."

"జెరంత పప్పేసి వండుకుతింటే మజాగుంటది." సుశీల సంతోషం వ్యక్తం చేసింది.

"గద్సరేగాని... మీరు పెద్దోళ్ళుగదా! మనలాంటోళ్ళని మావోలె మాట్లాడ్తున్నరేందీ?" లలిత ముక్కుమీద వేలేసుకుంది. చెవుల రాళ్ళకమ్మలు ఉయ్యాలలూగినై.

"మేము గూడా లంబాడోళ్ళమేనమ్మా! తండాలల్ల పెరిగినోల్లమే!" సుశీల గలగలా నవ్వింది. ఆ నవ్వులోని జలపాతం సవ్వడి లలిత దంపతులకు గిలిగింతలు పెట్టింది.

(మన ఆరోగ్యం - జనవరి *2011*)